సాక్షి
నల్లగొండ
మంగళవారం : 25 : ఫిబ్రవరి : 2025



ధ్వజారోహణం, దేవతాహ్వానం
గుట్ట శివాలయంలో జరుగుతున్న శివరాత్రి వేడుకల్లో భాగంగా ధ్వజారోహణం, దేవతాహ్వాన వేడుకలు నిర్వహించారు. - 8లో



పల్లివాడ మొల్లగా..
చదువుకుంటూనే కవయిత్రిగా రాణిస్తోంది రామన్నపేట మండలం పల్లివాడకు చెందిన బైకాని భవాని. - 8లో



భర్తకు తోడుగా..!
ఈజీగా డబ్బులు సంపాదించాలని భార్యభర్తలు దొంగలుగా మారారు. ఇద్దరూ కలిసి 40 కేసుల్లో నిందితులయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్య పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912

నల్లగొండ : జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ నంబర్ 1912కి ఫోన్ చేసి సమస్యను తెలియజేవచ్చని ట్రాన్స్‌కో నల్లగొండ కార్యనిర్వాహణ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్ల పరిధిలో వ్యవసాయానికి 20 గంటలు తగ్గకుండా త్రీఫేస్, గృహ, వాణిజ్య పరిశ్రమలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన వెంటనే తమ సిబ్బందికి తెలియచేయాలని సూచించారు.

రెండు రోజులు మద్యం షాపులు బంద్

నల్లగొండ : ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రెండు రోజుల పాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనున్న దృష్ట్యా మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్లు మూసివేయాలని పోలీసు శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఉత్వర్వుల్లో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పన్నులు వసూలు చేయాలి

వేములపల్లి(మాడ్గులపల్లి) : పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పన్ను వసూళ్లను పూర్తి చేయాలని డీపీఓ వెంకయ్య ఆదేశించారు. సోమవారం ఆయన మాడ్గులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజల నుంచి ఇంటి పన్ను వసూలు చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. వేసవి కారణంగా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా షేడ్‌నెట్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు నీటిని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సంగీత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే కందులకు మద్దతు ధర



కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

హాలియా : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కందులకు మద్దతు ధర లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు సోమవారం హాలియా వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు కంది పంటకు అమ్ముకునేందుకు కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో హాలియా వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కంది క్వింటాకు రూ.7550 అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఓ సరిత, సీఈఓ సత్యం, జానకిరాములు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించాలి

- ఎంజీయూ రిజిస్ట్రార్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ టూటౌన్: ఎయిడ్స్ నిర్మూలనపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. సోమవారం ఆయన యూనివర్సిటీలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లాస్థాయి క్లబ్స్, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వక్తృత్వ, స్కిట్ పోస్టర్, పాటల పోటీలు నిర్వహించారు. ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న మేఘనను వీసీ అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుధాకర్, మారం వెంకట రమణారెడ్డి, ప్రేమ్‌సాగర్, అరుణప్రియ, సుధారాణి పాల్గొన్నారు.

మొన్న సుంకిశాల.. నేడు ఎస్ఎల్‌బీసీ

పనుల మధ్యలోనే దెబ్బతిన్న ప్రాజెక్టులు



ఎస్ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్‌లో జరిగిన ప్రమాదాన్ని సోమవారం పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదంతో సాగునీటి కల సాకారంలో మరింత జాప్యం
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులిస్తే రెండు మూడేళ్లలో పనులు ప్రారంభానికి అవకాశం
- సుంకిశాల పూర్తయితే ఏకేబీఆర్‌లోని నీళ్లన్నీ జిల్లాలో వాడుకునేందుకు చాన్స్
- అప్పటివరకు నల్లగొండ జిల్లాకు అదనపు నీటి వసతి కష్టమే..

నల్లగొండ : మొన్న సుంకిశాల.. నేడు ఎస్ఎల్‌బీసీ ఈ రెండు ప్రాజెక్టుల్లో ప్రమాదాలు జరగడంతో జిల్లాకు వస్తుందనుకున్న అదనపు నీటి లభ్యత మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. లక్షలాది ఎకరాలు బీడు భూములు సస్యశ్యామలం కావాలని.. కృష్ణా జలాలు అందించి ఫ్లోరోసిస్ మహమ్మారిని తరిమాలనే లక్ష్యం ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. ఎస్ఎల్‌బీసీని రెండేళ్లలోని పూర్తి చేసి శ్రీశైలం నుంచి గ్రావీటి ద్వారా నీరందించేందుకు ప్రభుత్వం చేపట్టిన సొరంగ మార్గం ఇన్‌లెట్‌లో జరిగిన ప్రమాదం కారణంగా పనులు మరో మూడేళ్లకు పైగానే నిలిచిపోనున్నాయి. ఇదిలా ఉంటే గత ప్రభుత్వం నాగార్జునసాగర్ నుంచి డెడ్‌స్టోరేజీలో కూడా హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు తీసుకుపోయేందుకు నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు వద్ద ఇంటేక్ వెల్ పంపింగ్ స్టేషన్ వద్ద కాంక్రీట్ వాల్ గతేడాది ఆగస్టులో కూలిపోయి అది పూర్తిగా నీటమునిగిపోయింది. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. తాజాగా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్‌లో భారీ ప్రమాదం చోటు చేసుకోవడంతో జిల్లా ప్రజల ఆశలు గల్లంతయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులను విడుదల చేసి యుద్ధ ప్రతిపాదికన పనులు చేయించినా మరో ఐదేళ్లకు కూడా పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

వరదతో సుంకిశాలలో ప్రమాదం..


పెద్దవూర మండలం సుంకిశాల వద్ద సొరంగ మార్గం, ఇంటేక్ వెల్ పంపింగ్ స్టేషన్ వద్ద ఆగస్టులో జరిగిన ప్రమాదంతో ఆ పనుల్లో జాప్యం జరిగింది. ఆ ప్రాజెక్టు పూర్తయితే రోజూ హైదరాబాద్ జంట నగరాలకు 525 క్యూసెక్కుల నీరు సుంకిశాల నుంచే వెళ్లే అవకాశం ఉంది. పుట్టంగండి ద్వారా ఏకేబీఆర్‌కు వచ్చే నీరంతా జిల్లాలో వినియోగించుకునే అవకాశం ఏర్పడేది. సుంకిశాల వద్ద పనులు నిలిచిపోవడంతో.. ఏకేబీఆర్ నుంచే హైదరాబాద్‌కు తాగునీరు వెళ్తోంది.

మరమ్మతులకే రెండేళ్లు పట్టే అవకాశం

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం ఇన్‌లెట్‌లో సీపేజీ వాటర్ అధికంగా రావడం, సొరంగంపై కప్పు కూలిపోవడంతో 8 మంది కార్మికులు అందులో చిక్కుకుపోవడంతో పాటు బోరింగ్ మిషన్ కూడా దెబ్బతిన్నదని ఇంజనీర్లు చెబుతున్నారు. అన్నీ మరమ్మతు చేయడం, సొరంగ మార్గాన్ని తవ్వే పనులను తిరిగి ప్రారంభించాలన్న మరో రెండేళ్లు పట్టే అవకాశం ఉందని ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో టన్నెల్ బోరింగ్ మిషన్ పునరుద్ధణకు రెండేళ్లు పట్టే అవకాశం ఉంది. ఆదీ ప్రభుత్వం తగిన నిధులను సమకూర్చితేనే. సొరంగంలో సీజేపీని పూర్తిస్థాయిలో అరికడితేనే పనులు ముందుకు సాగుతాయి. లేకపోతే కష్టమే.

ఏప్రిల్‌లోనైనా ఔట్‌లెట్ పనులు ప్రారంభమయ్యేనా..

ఔట్‌లెట్‌లో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) బేరింగ్ అమెరికా నుంచి చెన్నై పోర్టు వచ్చిందని ఇంజనీర్లు వెల్లడించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ఔట్‌లెట్ వద్దకు తీసుకురావాల్సి ఉంది. వాహనం ఔట్ లెట్ వద్దకు చేరేందుకు మరో 25 రోజుల సమయం పట్టనుంది. దానిని టీబీఎంకు బిగించేందుకు మరో 20 రోజులు పట్టనుండగా, మొత్తానికి ఏప్రిల్ నెల మధ్యలో పనులను ప్రారంభించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌లెట్‌లో ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఔట్‌లెట్ పనులపై ఆ ప్రభావం పడవచ్చని, దీంతో ఔట్‌లెట్‌లో పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొందని అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలోని 4.16 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంతో చేపట్టిన ఎస్ఎల్‌బీసీ పనులపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకున్నాయి.



మన్నెవారిపల్లి వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఔట్‌లెట్

సుంకిశాలలో పనుల పునరుద్ధరణ

నాగార్జునసాగర్ : సాగర్ జలాశయం నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని తీసుకెళ్లేందుకు సుంకిశాల వద్ద జలాశయతీరంలో నిర్మిస్తున్న పంప్‌హౌస్ పునరుద్ధరణ పనులు ఈ నెల మొదటివారంలో పనులు మొదలయ్యాయి. గతేడాది ఆగస్టులో వచ్చిన భారీ వరద కారణంగా పంప్‌హౌజ్ నీట మునిగింది. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 533 అడుగులకు తగ్గడంతో పంప్‌హౌస్‌తో పాటు నీరు వెళ్లే సొరంగ మార్గం కూడా తేలింది. దీంతో కాంట్రాక్ట్ కంపెనీ పంప్‌హౌస్ పనులను పునరుద్ధరించింది. పంప్‌హౌస్ కూలిపోయిన సమయంలో జలాశయం నీటి మట్టం గరిష్టస్థాయిలో ఉండడంతో ఎంతమేరకు నష్టం జరిగిందో తెలియలేదు. ప్రస్తుతం నీటి మట్టం తగ్గడంతో అన్నీ కనిపిస్తున్నాయి. టన్నెల్‌లోకి పూర్తిస్థాయిలో మట్టి, రాళ్లు చేరాయని.. పంప్‌హౌస్ కొంత మేరకు కూలినట్లు కూలీలు చెబుతున్నారు. మొదట పంప్‌హౌస్‌లో నిలిచిన నీటిని డీవాటరింగ్ చేసి.. సొరంగంలో ఉన్న మట్టి, రాళ్లను తొలగించాకే పంప్‌హౌస్ పనులు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.





సుంకిశాల వద్ద నుంచి నీరు తీసుకునే ప్రాంతం, (ఇన్‌సెట్‌లో) టన్నెల్ ద్వారా వచ్చే నీరు ఇన్‌టేక్ వెల్ సంప్, పంప్ హౌస్

ప్రచారానికి నేడు ఆఖరు

- ఎత్తులు పైఎత్తులతో ఎమ్మెల్సీ అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ప్రచార వ్యూహాలకు పదును పెట్టి దూసుకుపోతున్నారు. టీచర్లతో సభలు, సమావేశాలు, విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రచారానికి ఒక్క రోజే మిగిలి ఉండటంతో ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ఇక కొంతమంది తాయిలాలు పంపిణీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల గుణగణాలపైనా దృష్టి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఈసారి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు కూడా ఈ ఎన్నికల్లో సంఘాల కంటే అభ్యర్థులపైనే ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏ అభ్యర్థి ఎలాంటి వారు.. తమ సమస్యలపై ఎలా స్పందిస్తారు.. తాము చెబితే వింటారా? ఎన్నికల్లో గెలిపించాక ముఖం చాటేస్తారా? అన్న కోణాల్లోనూ ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు పాఠశాలల వారీగా ఓటర్లను కలిసి ప్రసన్నం చేసుకుంటున్నారు. గతంలో తాము చేసిన పనులను చెప్పుకోవడంతోపాటు.. గెలిస్తే ఏం చేస్తామనేది ప్రత్యేకంగా వివరిస్తున్నారు.

సోషల్ మీడియా గ్రూపులు

ఈ ఎన్నికల్లో అభ్యర్థులు తమ ప్రచారం కోసం సోషల్ మీడియాను పెద్ద ఎత్తున ఉపయోగించుకుంటున్నారు. ఉపాధ్యాయ ఓటర్ల ఫోన్ నంబర్లతో మండలాల వారీగా వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధాన పోటీదారులైన మిగతా అభ్యర్థుల పనితీరు, వారిపై ఉన్న ఆరోపణలపై వీడియోలు చేసిమరీ ప్రచారం చేస్తున్నారు.

రెండో ప్రాధాన్యత ఓట్లపైనా దృష్టి

కొంతమంది అభ్యర్థులు రెండో ప్రాధాన్యత ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. సంఘాలకు మాత్రమే ఓట్లు వేసే ఓటర్లను ప్రసన్నం చేసుకొని, తమకు రెండో ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

సభలు, ర్యాలీలు, విందులు

టీచర్స్ జేఏసీ మద్దతుతో బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం వరంగల్‌లో భారీ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఇక మరికొంత మంది అభ్యర్థులు చిన్న చిన్న సంఘాలకు చెందిన ఓటర్ల కోసం రీసార్ట్స్, ఫంక్షన్ హాళ్లలో విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఓ అభ్యర్థి రంగారెడ్డి జిల్లాలోని ఓ ఫంక్షన్‌హాల్లో మండల శాఖలకు చెందిన బాధ్యులకు, ఒక రిసార్ట్‌లో ముఖ్య నేతలకు పార్టీ ఏర్పాటు చేశారని తెలిసింది. ఇక పోటీలో 19 మంది ఉండగా.. అందులో కొందరు తమవర్గం ఓటర్లు ఇంతమంది ఉన్నారంటూ ప్రధాన అభ్యర్థులతో బేరసారాలు చేస్తున్నట్లుగా చర్చ సాగుతోంది. తాము సైలెంట్‌గా ప్రయోజనం ఏంటని, ఏం చేస్తారని అడుగుతున్నట్లు తెలిసింది.

కేంద్ర బడ్జెట్‌తో అన్ని వర్గాలకు మేలు

- రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎంపీ లక్ష్మణ్, అభ్యర్థి సరోత్తంరెడ్డి

నల్లగొండ టూటౌన్ : కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగనుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండకు వచ్చిన ఆయన ఓ హోటల్‌లో మేధావులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్ మోదీ లక్ష్యమని, దీనిలో భాగంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని తెలిపారు. మేధావులంతా నరేంద్రమోదీకి అండగా నిలబడి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ ఫిరాయింపులు కాంగ్రెస్ పార్టీకి గుదిబండగా మారబోతున్నాయని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీ ఫైనల్స్ లాంటివని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలు తొలి మెట్టని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, ఉపాధ్యా ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, చల్లా శ్రీలతారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నివేధిత, పాపారావు, వీరారెడ్డి, రమణముదిరాజ్ పాల్గొన్నారు.

నకిరేకల్‌లో ఎన్నికల ప్రచారం

నకిరేకల్ : బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎంపీ కె.లక్ష్మణ్ సోమవారం నకిరేకల్‌లో ప్రచారం చేశారు. తెలంగాణ లో ప్రత్యామ్నయంగా బీజేపీ ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో మూడు చోట్లు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయని, మేధావులు ఆలోచించి తమ ఓటును బీజేపీ అభ్యర్థులకు వేసి గెలింపించాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల శివాణి, బుడిగె సైదులు, నకిరెకంటి మొగిలయ్య, మండల వెంకన్న, యానాల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా డాకయ్య, పల్స శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ : మార్చిలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేవించారు. సోమవారం ఆయన తన చాంబర్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలను 28,722 మంది పదో తరగతి పరీక్షలను 18,666 మంది విద్యార్థులు రాస్తున్నారని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 52, టెన్త్ పరీక్షలకు 105 రెగ్యులర్, 3 ప్రైవేట్ కేంద్రాలను ఏర్పాటు వివరించారు. పరీక్షల సందర్భంగా 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డీఐఈఓ దస్రూనాయక్, డీఈఓ భిక్షపతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రికి 70 ప్రత్యేక బస్సులు : ఆర్‌ఎం

మిర్యాలగూడ టౌన్, రామగిరి(నల్లగొండ): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవక్షేత్రాలకు రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి 70 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోదాడ నుంచి మేళ్లచెర్వుకు 30, దేవరకొండ నుంచి శ్రీశైలం 25, మిర్యాలగూడ నుంచి వాడపల్లికి 5, మిర్యాలగూడ నుంచి సుంకిశాల 5, మిర్యాలగూడ నుంచి సోమప్ప 5 మొత్తం 70 బస్సులు నడుపుతున్నామని చెప్పారు. ఈ నెల 25 నుంచి 27 వరకు ఈ బస్సులు నడుస్తాయన్నారు. ఈ బస్సుల్లో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని తెలిపారు. త్వరలోనే నల్లగొండ రీజియన్ పరిధిలోని నల్లగొండ డిపోకు 72, సూర్యాపేట డిపోకు 64 వరకు ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయని తెలిపారు. నల్లగొండ డిపోకు చెందిన 13 బస్సులను మిర్యాలగూడ డిపో నుంచి నడిపించే విధంగా ప్రతిపాధనలు పంపించామన్నారు. ప్రస్తుతం నల్లగొండ రీజియన్‌లో రోజూ రూ.కోటి 40లక్షల వరకు ఆదాయం వస్తోందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ డిపో మేనేజర్(ట్రాఫిక్) భారతీబాయి, ఎంఎఫ్ పుప్పాల యాదగిరిల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి

భూమి పట్టా చేశాం.. మమ్మల్ని పట్టించుకోవట్లే!

- అదనపు కలెక్టర్ ఎదుట గోడు వెల్లబోసుకున్న వృద్ధ దంపతులు
- ఆసుపత్రి ఖర్చులకు కూడా డబ్బుల్లేవని ఆవేదన



కుటుంబ సభ్యులతో వచ్చి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వృద్ధులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కొడుకు దూరమైనా.. వృద్ధాప్యంలో తమకు ఆసరాగా ఉంటారని ఆస్తినంతా కోడలు, మనవరాలి పేరున పట్టా చేశారు ఆ వృద్ధ దంపతులు. కానీ ఇప్పుడు వారు అనారోగ్యం పాలైతే కనీసం కోడలు పట్టించుకోవడం లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమను ఆదుకోవాలని ఆ వృద్ధులు అధికారులను ఆశ్రయిస్తే.. న్యాయం జరగలేదు. ఏమైనా ఉంటే కలెక్టర్‌ను సంప్రదించండి అని ఉచిత సలహా ఇచ్చారు. దీంతో కంగుతిన్న ఆ వృద్ధులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.

చనిపోయే వారికి అంత ఖర్చు ఎందుకుని..

అనుముల మండలం ఇబ్రహీంపేటకు చెందిన రుద్రాక్షి వెంకటమ్మ, సాయిలు వృద్ధ దంపతులు. వారికి నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లల వివాహాలు చేశారు. 20 ఏళ్ల కిందట కుమారుడు రుద్రాక్షి యాదయ్యకు సుమలతను ఇచ్చి వివాహం చేశారు. వారికి ఓ కూతురు లావణ్య ఉంది. అంతలోనే కొడుకు యాదయ్య చనిపోయాడు. కోడలు, మనవరాలిని చూసుకుంటూ గడిపేద్దామనుకున్నారు సాయిలు, వెంకటమ్మ. వారికి భరోసా ఉండాలన్న ఉద్దేశంతో సాయిలు తన పేరుమీదున్న భూమిని కోడలు పేరిట, తన భార్యకు పసుపు కుంకుమల కింద ఇచ్చిన భూమిని మనవరాలి పేరున మొత్తంగా 9 ఎకరాలు పట్టా చేశారు. ఇటీవల వెంకటమ్మ ఆరోగ్యం దెబ్బతింది. డిసెంబర్ 12వ తేదీన ఆమెను సుమలత నల్లగొండలోని ఓ ఆసుపత్రిలో చేర్పించి వెళ్లిపోయింది. వారి కూతుళ్లు నిమ్మల శశికళ, గుర్రం నవనీత, అంగడి రేణుక ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ అని చెప్పి ఆపరేషన్ చేశారు. దాదాపు రూ.22 లక్షలు ఖర్చు అయ్యాయి. ఆ బిల్లులు చెల్లించాలని వారు కోడలు సుమలతను కోరగా చనిపోయే మీకు అన్ని డబ్బులు అవసరమా అంటూ చివాట్లు పెట్టింది. చివరకు చేసేదేమీ లేక జనవరి 22వ వారు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను ఆశ్రయించారు. వయోవృద్ధుల చట్టం -2007 ప్రకారం వారికి తక్షణ వైద్య ఖర్చుల కింద రూ.5 లక్షలు ఇవ్వాలని కోడలును ఆదేశించారు. లేకపోతే వృద్ధ దంపతులు పట్టా చేసిన సర్వే నెంబర్ 256/3లోని ఎకరం భూమిని వారికి పట్టా చేయాలని అనుముల (హాలియా) తహసీల్దార్‌ను ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఆ కోడలుకు నోటీసులు జారీ చేశారు.

డబ్బు తీసుకోలేదని కేసు క్లోజ్..

సుమలత రూ.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకుందని.. ఈనెల 11వ తేదీన రావాలని అనుముల తహసీల్దార్ రుద్రాక్షి సాయిలు-వెంకటమ్మకు 10వ తేదీన నోటీసులు పంపారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధ దంపతులు 11వ తేదీన వెళ్లలేకపోయారు. దీంతో తహసీల్దార్ సబ్ కలెక్టర్‌కు 11వ తేదీన నివేదిక పంపారు.. చెప్పిన రోజున డబ్బు తీసుకునేందుకు రాలేదని.. ఈ కేసును క్లోజ్ చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఒక్కరోజులోనే ఇలా కేసును క్లోజ్ చేయడంతో వారు లబోదిబోమన్నారు.

అదనపు కలెక్టర్‌కు అప్పీల్..

తమకు జరిగిన అన్యాయాన్ని ఆ వృద్ధ దంపతులు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వివరించారు. కొడుకు లేకపోవడంతో కోడలు కంటికి రెప్పలా చూసుకుంటుందని భూమి ఇచ్చాం. అనారోగ్యం పాలైతే మమ్మల్ని కాటికి పొమ్మంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అదనపు కలెక్టర్.. ఐసీడీఎస్ అధికారి కృష్ణవేణిని పిలిచి వెంటనే ఫైల్ కలెక్టర్‌కు పెట్టాలని ఆదేశించారు. ఈ కేసు కలెక్టర్ చూసుకుంటారని చెప్పి వారిని పంపించారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సోమవారం 67 ఫిర్యాదుల వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం

- ఎన్నికలు పూర్తయ్యేవరకు 144 సెక్షన్
- నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో 48 గంటల నిశ్శబ్ద వ్యవధి (సైలెన్స్ పీరియడ్) అమల్లో ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయడం నిషేధమని పేర్కొన్నారు. ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్ పంపడంపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే సందేశాలను నిశితంగా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. సైలెంట్ పీరియడ్ లో నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సైలెంట్ పీరియడ్‌లో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులు ఎవరు జిల్లాలో ఉండవద్దని స్పష్టం చేశారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఒపీనియన్ పోల్, ఎగ్జిట్ పోల్స్ నిషేధమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు నియోజకవర్గంలోని అన్ని జిల్లాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మిర్యాలగూడ: లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం దామరచర్ల మండలం వాడపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన శంకరశెట్టి వెంకటచంద్రశేఖర్‌రావు (38) తన ద్విచక్ర వాహనంపై శ్రీనగర్ నుంచి దామరచర్లకు వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వెంకటచంద్రశేఖర్‌రావు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతుడి తల్లి బాలకోటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుడి చేతిపై ఉన్న పచ్చబొట్టు

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్ల గొండ మండల పరిధిలోని దీపకుండ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండంలోని దీపకుంట సమీపంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వ్యక్తి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. మృతుడి కుడి చేతిపై స్వరూప చెల్లి అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. వ్యక్తి వివరాలు తెలిసిన వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.



తటాకం.. అరుణవర్ణ శోభితం

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పట్టణంలోని పోచంపల్లి చెరువు వద్ద సోమవారం సాయంత్రం ఆవిష్కృతమైన దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. భానుడు అస్తమిస్తున్న వేళ సూర్యుడి కిరణాలు పరావర్తనం చెంది ఆకాశం అరుణవర్ణంలోకి మారింది. దాని ప్రతిబింబం చెరువులో పడి నింగి, నీరు కలిసిపోయి ఎరుపురంగులోకి మారి ఆహ్లాదం కలిగించింది.

- భూదాన్‌పోచంపల్లి

దొంగతనంలోనూ భర్తకు తోడుగా..!

- ఈజీగా డబ్బులు సంపాదించాలని దొంగలుగా మారిన భార్యభర్త
- భర్తపై 30, భార్యపై 10 కేసులు నమోదు
- జైలుకు వెళ్లివచ్చినా తీరు మారని దంపతులు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు



దొంగతనం కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరబాబు

మిర్యాలగూడ అర్బన్: వారిద్దరు భార్య భర్తలు.. వివాహం అయిన తరువాత జల్సాలకు అలవాటు పడిన భర్త దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు తెస్తుండడంతో భార్య కూడా ఇదేదో బాగుంది అనుకుని ఇద్దరూ దొంగతనాలకు అలవాటు పడ్డారు. ఏకంగా ఇద్దరు కలిసి 40 కేసుల్లో నిందితులుగా మారారు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణం సుందర్‌నగర్‌కు చెందిన వేముల కోటేష్ 2010 నుంచి 2024 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మిర్యాలగూడతో పాటు, వాడపల్లి, హాలియా, నకిరేకల్, నార్కట్‌పల్లి, నల్లగొండ, సూర్యాపేట, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, గుడ్లపల్లి, చౌటుప్పల్, భువనగిరి, ఆదిబట్ల, గుర్రంపోడు, వలిగొండ, అచ్చంపేట, కట్టంగూర్ పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు ఏపీలోని గురజాల, రెంటచింతల ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇతనిపై పలు కేసులు నమోదు కావడంతో ఆయా కేసుల్లో జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. అంతే కాకుండా 2024 మార్చి నెలలో వేముల కోటేష్ ఆయన భార్య కృష్ణవేణిపై దొంగతనం కేసులు నమోదు కావడంతో పోలీసులు ఇద్దరిని జైలుకు పంపారు. గతేడాది జూలై నెలలో జైలు నుంచి విడుదలైన ఈ దంపతులిద్దరూ తమ తీరు మార్చుకోకుండా రైళ్లు, బస్సుల్లో తిరుగుతూ దొంగతనాలు చేస్తూనే ఉన్నారు.

నిఘా పెట్టి అదుపులోకి..

వీరిద్దరిపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి వద్ద బయట కపలాగా భార్య కృష్ణవేణిని ఉంచి దొంగతనం చేసేందుకు సిద్ధగా కోటేష్‌లను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిపై మొత్తం 40 కేసులు ఉన్నాయని వీరి వద్ద నుంచి 997.9 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక స్మార్ట్ ఫోన్, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.రాంబాబు, ఏఎస్ఐ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు ఎండి.అక్బర్, ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నకిలీ కరెన్సీ కలకలం

- బొత్తలపాలెంలోని ఓ రైతు పొలంలో లభించిన రూ.500 నోట్లు
- నోట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు



పొలంలో పడేసిన నకిలీ నోట్ల కట్టలు

మిర్యాలగూడ: పొలంలో నకిలీ కరెన్సీ నోట్ల కట్టలు దొరికిన సంఘటన దామరచర్ల మండలంలో సోమవారం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి–అద్దంకి రహదారి వెంట బొత్తలపాలెం వద్ద గల ఓ రైతు తన పొలంలోకి వెళ్లగానే కరెన్సీ నోట్ల కట్టలతో కూడిన సంచి కనిపించింది. సంచిలో నిండుగా ఉన్న కట్టలను ఎవరో అక్కడి వదిలి వెళ్లినట్లు ఆయన గుర్తించారు. రూ.500నోట్లతో పేర్చిన 40 కట్టలు చూసిన స్థానికులు కొన్ని కట్టలను తమ వెంట తీసుకెళ్లారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో రూరల్ సీఐ వీరబాబు స్థానికుల నుంచి వివరాలు సేకరించి మిగిలిన నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. అసలు నోట్లను పోలి ఉన్న ఈ నోట్లపై చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉంది. ఈ నోట్లను ఎందుకు వినియోగిస్తారనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

దొంగనోట్ల ముఠా పనేనా!

సుమారు రూ.20లక్షల విలువగల నకిలీ రూ.500 కట్టలు పంట పొలంలో ప్రత్యక్షమవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. దొంగనోట్ల ముఠా పని కావొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సైతం దామరచర్ల మండలంలో దొంగనోట్ల చలామణి జరిగిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుతం పోలీసుల నిఘా వైఫల్యంతో అదే ముఠా మళ్లీ చెలరేగుతున్నట్లు పలువురు అనుమానిస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టి దొంగనోట్ల ముఠాను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

కారు, ఆర్టీసీ బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

చిలుకూరు : కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల వద్ద కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హుజూర్‌నగర్ వైపు వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి హుజూర్‌నగర్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయాలైన వ్యక్తులను వెంటనే 108 అంబులెన్స్‌లో కోదాడ వైద్యశాలకు తరలించారు. అతివేగం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు.

ముగ్గురికి జరిమానా

చివ్వెంల: వ్యక్తిని గాయపరిచిన కేసులో ముగ్గురికి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్ట్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ గోపు రజిత సోమవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్ గ్రామానికి చెందిన గంగరబోయిన మధు 2018 ఆగస్టు 30 రాత్రి 8గంటల సమయంలో కిరాణా షాపు వద్ద కూర్చొని ఉన్నారు. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన తండు వెంకన్న, తండు సోమయ్య, తండు అంజమ్మలు ఆటో ఫైనాన్స్ విషయంలో మధుతో గొడవపడి అతనిని గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ కె.మహేష్ కేసు నమోదు చేశారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి, పీపీ బి.హేమలత నాయుడు వాదనలతో ఏకీభవిస్తూ నిందితులకు ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. పీపీకి కోర్టు కానిస్టేబుల్ చైతన్య సహకరించారు.

నెట్ ఫలితాల్లో ఎంజీయూ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

నల్లగొండ టూటౌన్: యూజీసీ సోమవారం వెలువరించిన నెట్ ఫలితాల్లో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వీరిలో లింగరాజు మహేష్ కుమార్, చిరుమర్తి అనిల్ కుమార్ యూజీసీ నెట్ సాధించగా పృథ్వీ, నవ్య, మల్లేష్, రమ్య పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హత పొందారు. వీరిని వీసీ అల్తాఫ్ హుస్సేన్, అల్వాల రవి, తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ ఆనంద్, నరసింహ, డాక్టర్ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

మిర్యాలగూడ అర్బన్ : ఐదుగురు స్నేహితులు కలిసి మద్యం తాగిన ఘటనలో అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతిచెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై మృతుడి భార్య సోమవారం మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు చేసిన ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన కోడిరెక్క సంపత్‌కుమార్(32) ప్రైవేట్ సంస్థలో ఫైనాన్స్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం అతని స్నేహితులు ఆర్ఎంపీ డాక్టర్ ఎండి.గౌస్అలీ, రెడ్డిమాస్ యశ్వంత్, గురజాల బాలరాజు, పొదిళ్ల అన్వేష్‌తో కలిసి ముత్తిరెడ్డికుంటలోని ఓ బెల్ట్ షాపులో మద్యం తాగారు. అనంతరం కోడిరెక్క సంపత్ కుమార్, గౌస్అలీలు అర్ధరాత్రి విపరీతంగా రక్తపు వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ కోడిరెక్క సంపత్ కుమార్ మృతి చెందగా.. గౌస్అలీ పట్టణంలోని అపోలో ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. కాగా సంపత్ కుమార్ మృతిపై ఆన భార్య రమ్య అనుమానం వ్యక్తం చేస్తూ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పథకం ప్రకారం తన భర్త తాగిన మద్యంలో ఏమైనా కలిపి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

వ్యవసాయబావిలో మృతదేహం లభ్యం

భూదాన్‌పోచంపల్లి: వ్యవసాయబావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన సోమవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో మెయిన్‌రోడ్డు ప్రక్కనే ఉన్న కొత్తకాపు రామచంద్రారెడ్డి వ్యవసాయ బావిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన గ్రామానికి చెందిన కొందరు యువకులు 100 నంబర్‌కు కాల్‌చేశారు. దాంతో సమాచారం అందుకొన్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావి నుంచి బయటికి తీశారు. కాగా మృతదేహం బాగి ఉబ్బి, కుళ్లిన స్థితిలో ఉండడంతో ఇతను రెండు రోజుల క్రితం బావిలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, గ్రామ సమీపంలోని కంపనీలో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడై ఉంటారని అనుమానిస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కంచర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

వేములపల్లి(మాడ్గులపల్లి): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంపెల్లి నగేష్ భార్యాపిల్లలు అమలాపురంలో నివాసం ఉంటుండగా నగేష్ తన తల్లిదండ్రులతో కలిసి కుక్కడంలో ఉంటున్నాడు. నగేష్ అనారోగ్యంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆదివారం రాత్రి కుక్కడం చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. నగేష్ సోమవారం ఉదయం ఇంట్లో కనిపించకపోవడంతో స్థానికుల సహాయంతో తల్లిదండ్రులు వెతకగా చెరువు వద్ద చెప్పులు కనిపించాయి. గ్రామానికి చెందిన కొంతమంది చెరువులో గాలించగా నగేష్ మృతదేహం లభించింది.

గొర్రెలకాపరి ఆత్మహత్య

చింతపల్లి: గొర్రెలకాపరి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చింతపల్లి మండలం సాయిరెడ్డిగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం ..నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం ముదరబండ గ్రామానికి చెందిన గొర్రెలకాపరి దాసరి బయన్న (23) తన భార్య బాలమ్మతో కలిసి చింతపల్లి మండలం సాయిరెడ్డిగూడెం గ్రామ శివారులో గొర్రెలను మేపుతున్నాడు. ఆదివారం రాత్రి గ్రామ శివారులోని బయన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెల్లవారుజామున చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వర్ణగిరిలో శ్రీవారి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి

భువనగిరి: పట్టణ పరిధిలోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. త్రిదండి రామానుజ చిన్న జీయర్‌స్వామి పర్యవేక్షణలో కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా జీయర్‌స్వామికి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ మానేపల్లి రామారావు, ధర్మకర్తలు మురళీకృష్ణ, గోపీకృష్ణ దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవనం చేశారు. అనంతరం రాత్రి ఆలయ మాడవీధుల్లో స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లివాడ మొల్లగా..

కవిత్వంలో రాణిస్తున్న భవాని

- వందకుపైగా కవితలు రాసిన విద్యార్థిని
- అచ్చుకు నోచుకోని అందమైన కవితలు



కవిత రాస్తున్న విద్యార్థిని బైకాని భవాని

రామన్నపేట : ఒకపక్క చదువు కొనసాగిస్తూనే మరోపక్క యువ కవయిత్రిగా రాణిస్తోంది యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం పల్లివాడ గ్రామానికి చెందిన బైకాని భవాని. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్‌సీ) తృతీయ సంవత్సరం చదువుతున్న భవాని ఇప్పటి వరకు వందకుపైగా కవితలు రాసి అందరి మన్ననలు పొందుతోంది. పల్లివాడలో వ్యవసాయ కుటుంబానికి చెందిన బైకాని నాగమల్లయ్య–సత్తమ్మ దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. వీరిలో మొదటి సంతానమైన భవాని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు, మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు, రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివింది. ప్రస్తుతం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బీఎస్సీ(బీజెడ్‌సీ) తృతీయ సంవత్సరం చదువుతోంది. భవాని చదువులో ఎప్పుడూ ముందుంటుంది. అలాగే ఆశువుగా కవితలు అల్లడంపై అభిరుచి పెంచుకుంది. దీంతో తాను కవితలు రాయడం మొదలు పెట్టింది.

పాఠశాలలోనే కవితలకు శ్రీకారం

భవాని మునిపంపుల జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నప్పుడు సైన్స్ టీచర్ గీత అంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమెపట్ల ఎనలేని ప్రేమ, గౌరవం ఉండేది. ఆ టీచర్ పాఠశాలకు రానిరోజున ఏదో పోగొట్టుకున్నట్లుగా భావించేది. పదవ తరగతి చదువుతున్నప్పుడు ఒక రోజు గీత మేడం పాఠశాలకు కాలేదు. ఆమె పాఠశాలకు రానిరోజున పాఠశాలలో కనిపించిన వెలితిని వర్ణిస్తూ భవాని తన మొట్టమొదటి కవితను రాసింది. భవాని రాసిన కవిత తోటి విద్యార్థుల ద్వారా ఉపాధ్యాయులకు తెలిసింది. కవితను చదివిన ఉపాధ్యాయులు భవాని భావుకతకు మెచ్చుకున్నారు. అప్పటి నుంచి భవాని కవితలు రాయడం మొదలు పెట్టింది. ఈ క్రమంలో తన ఊరు అందాలు, గొప్పతం, అమ్మతనం గురించి, మహిళల ఓర్పు, గ్రామిక స్త్రీలు పడే కష్టాలు, మొబైల్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఇప్పటి వరకు వందకుపైగా కవితలు రాసింది. తన కవితల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచేందుకు ప్రయత్నిస్తోంది భవాని. అందుకే భవానిని అందరు పల్లివాడ మొల్లగా పిలుస్తు న్నారు. కాని భవాని రాసిన కవితలు ఒక్కటి కూడా పుస్తక రూపం దాల్చలేదు.

భవాని రాసిన మొదటి కవిత..

"చిరునవ్వులాంటి మీ స్నేహం
నా చెంతకు చేరలేదండి
నక్షత్రాలు లేని ఆకాశం
మెరుపులు లేని వర్షం
రంగులు లేని ప్రపంచం
సూర్యుడులేని సమస్తం
ప్రశాంతత లేని గుడి
ఈరోజు మీరు లేని బడి "

మరో కవిత :

"అర్థంలేని ఆవేశం ఎందుకు
ఆనందంగా సాగిపోక మందుకు
కోట్లకై కొట్లాడుతావెందుకు
ఉన్నది ఒక్కటే జిందగీ మనకు
స్వార్థం అనే మాట ఎందుకు
వ్యర్థం కదా ఈ చిన్న బతుకు
అసూయ ద్వేషం ఎందుకు
దారి దొరుకుతుందా స్వర్గసీమకు"

అలా అనేక కవితలు రాసిన భవాని కళాశాలలో ఉపాధ్యాయుల నుంచి ప్రశంసలు, బహుమతులు పొందింది.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే మొదలుపెట్టాను

అమ్మలాంటి తెలుగు భాష అంటే నాకెంతో ఇష్టం. పాఠశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే కవితలు రాయడం మొదలు పెట్టాను. నేను రాసిన కవితలను ఒక నోటు పుస్తకంలో భద్రపర్చుకుంటున్నాను. గొప్ప గొప్ప వాళ్లు రాసిన పుస్తకాలు చూసినప్పుడల్లా నా కవితలు కూడా పుస్తక రూపంలోకి తేవాలనిపిస్తుంది. అది సాధ్యం కాకపోయినా కవితలు రాయడం కొనసాగిస్తూనే ఉంటాను.

– బైకాని భవాని, యువ కవయిత్రి, పల్లివాడ గ్రామం

నిజాయితీ చాటుకున్న సివిల్ సప్లయ్ అధికారి

- బస్సులో రూ.50 వేల నగదు మరిచిపోయిన రైతు
- ఆ డబ్బును తీసి బాధితుడికి ఇచ్చిన డీటీ రఘునందన్



సివిల్ సప్లయ్ అధికారి రఘునందన్

చింతపల్లి: దొరికిన డబ్బును బాధితుడికి అందజేసి తన నిజాయితీని చాటుకున్నాడు ఓ సివిల్ సప్లయ్ అధికారి. హైదరాబాద్‌కు చెందిన మాచన రఘునందన్ పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోమవారం మధ్యాహ్నం చింతపల్లిలోని ఓ రైస్ మిల్లు తనిఖీ కోసం హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో వస్తున్నారు. అదే బస్సులో చింతపల్లి మండలానికి చెందిన ఓ రైతు ఐలయ్య కూడా వస్తున్నాడు. బస్సు చింతపల్లి రాగానే సీట్లోంచి లేచి బస్సు దిగడానికి వెళ్తున్న ఐలయ్య తన డబ్బు పడిపోయిన విషయం గమనించలేదు. కంగారు, కంగారుగా బస్ దిగేశాడు. డబ్బు కనపడక పోయేసరికి ఆందోళనకు గురయ్యాడు. ఇంతలోనే సివిల్ సప్లయ్ డీటీ రఘునందన్ గమనించి ఐలయ్య కూర్చున్న సీటు కింద పడి ఉన్న ఆ డబ్బును తీసి వెంటనే ఐలయ్యను పిలిచి బస్సులోంచే అతనికి అందజేశారు. దీంతో ఐలయ్య కాస్త కుదుటపడ్డాక, అంత డబ్బు ఎక్కడివి ఎక్కడినుంచి తెస్తున్నావ్ అని అడిగితే.. 'బిడ్డ లగ్గం ఉంది.. హైదరాబాద్‌లో తెలిసిన వారి దగ్గర జాగా కాగితాలు కుదువ పెట్టి తీసుకొస్తున్న సారూ..' అని ఐలయ్య బదులిచ్చాడు. సార్.. పోయిన నా డబ్బులు తిరిగి ఇచ్చినవ్. ఓ రూ.వెయ్యి తీసుకో అని ఐలయ్య ప్రాథేయపడగా.. నాకేమీ వద్దు.. 'నీకు బీడీలు తాగే అలవాటు ఉన్నట్టుంది.. అది మానెయ్ చాలు' అంటూ ఆన తీసుకున్నారు.

ధ్వజారోహణం, దేవతాహ్వానం

- యాదగిరి క్షేత్రంలో కొనసాగుతున్న మహా శివరాత్రి వేడుకలు



ధ్వజపటానికి పూజలు చేస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకవాలు పాంచాహ్నిక దీక్షతో వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన సోమవారం ఉదయం నిత్య హవనములు, శివపంచాక్షరీ జపములు, నందీశ్వర పారాయణం, పంచసూక్త పఠనం, మూలమంత్ర జపములు, వివిధ పారాయణములు నిర్వహించారు. అనంతరం ధ్వజపటంపై పరమేశ్వరుడి వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరించి ఆలయ ఉపచారములు గావించి ధ్వజస్తంభంపై అలంకరించి నందీశ్వర ధ్వజారోహణ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం భేరీ పూజ నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగేలా చూడాలని కోరుతూ దేవతాహ్వాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ యాగశాలలో అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పారాయణీకులచే లఘు పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ సిద్ధాంతి, ప్రధానార్చకులు, పారాయణీకులు, పురోహితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుదర్శన హోమం పునఃప్రారంభం

యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిలిపి వేసిన శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని ఆలయ అర్చకులు సోమవారం పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా పునఃప్రారంభించారు. ఉదయం 7గంటలకు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని భక్తులచే నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి వేడుకలను అర్చకులు జరిపించారు.

మోదుగు పూల సోయగం



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రం సమీపంలో రోడ్డు వెంట ఉన్న మోదుగు చెట్టు విరబూసి చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ పూలను ఉడికించి రసం తీసి హోలీ పండుగ రోజు రంగుగా చల్లుకుంటారు. అయితే వచ్చే నెల 14న హోలీ పండుగ ఉండడం ముందుగానే మోదుగు చెట్లు ఎర్రటి పూలతో నిండుగా కనిపిస్తుండడంతో వాటిని చూసి జనం అబ్బురపడి పోతున్నారు.

- ఆత్మకూరు(ఎం)

సాక్షి
నల్లగొండ
బుధవారం। 26। ఫిబ్రవరి। 2025



శివపార్వతుల కల్యాణం
యాదగిరిగుట్టకు అనుబంధంగా ఉన్న రామ లింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.
- 8లో



ఇద్దరు కూలీలు మృతి
క్వారీ లోపలికి వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి కిందపడడంతో ఇద్దరు వలస కూలీలు మృతిచెందారు.
- 8లో



ముగ్గురు అరెస్ట్
రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో

న్యూస్‌రీల్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

నల్లగొండ టౌన్ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ పీహెచ్‌సీలకు వచ్చే రోగుల రక్తనమూనాలు సేకరించి తెలంగాణ హబ్‌కు పంపాలన్నారు. ఆయా రిపోర్టుల ఆదారంగా పీహెచ్‌సీ వైద్యులు సరైన వైద్య సేవలు అందించాన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వేణుగోపాల్‌రెడ్డి, కళ్యాణ చక్రవర్తి, పద్మ, అరుంధతి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పన్నాల గోపాల్‌రెడ్డిని గెలిపించాలి

- ఎమ్మెల్సీ కోదండరాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పన్నాల గోపాల్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం కోరారు. మంగళవారం ఆయన నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గోపాల్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా ఎన్నో సేవలందించారని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడారని గుర్తుచేశారు. గోపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో అభ్యర్థి గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

28న పాఠశాలల్లో సైన్స్ సంబరాలు

నల్లగొండ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 28న జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సైన్స్ సంబరాలు నిర్వహించాలని డీఈఓ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల చేత సైన్స్ ప్రయోగాలు, సెమినార్లు, వ్యాసరచన, క్విజ్, ఒరిగామి, పోస్టర్ తయారీ, సైన్స్ పుస్తకాల ప్రదర్శన, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారీ, సైన్స్ సామగ్రి ప్రదర్శన, అందుబాటులో ఉన్న సైన్స్ మ్యూజియం, టెలిస్కోప్‌తో రాత్రి ఆకాశ పరిశీలన, సైన్స్ మేళా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించి ఆ వివరాలు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్‌కు మార్చి 5వ తేదీలోగా Lgscertmathsscience@gmail.com మెయిల్ చేయాలని సూచించారు. వివరాలకు 98485 78845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కవి ముంగర జాషువా కన్నుమూత



ముంగర జాషువా (ఫైల్)

నాగార్జునసాగర్ : కవి ముంగరజాషువా కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన సోమవారం రాత్రి నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ముంగర జాషువా తెలుగు సాహితీలోకానికి చిరపరిచితులు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

చింతపల్లి : మండల పరిధిలోని కుర్మేడు పద్మశాలి కాలనీలో వారం రోజులుగా తాగునీరు రావటం లేదని మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నాగార్జునసాగర్ –హైదరాబాద్ హైవే రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వారం రోజులుగా కాలనీకి మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ ఏఈ శేఖర్, వాటర్ గ్రిడ్ ఏఈ లింగం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అత్తర్ మహిళల వద్దకు చేరుకొని రెండు రోజుల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

పకడ్బందీగా పోలింగ్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం
- విధులకు రెండు వేల మంది సిబ్బంది
- దూర ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు భద్రంగా తెచ్చేలా కార్యాచరణ
- వాహనాలకు నల్లగొండ జిల్లా పోలీసుల భద్రత
- ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోండి
- ఉపాధ్యాయ ఓటర్లకు రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి సూచన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశాం. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశాం. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుంది. వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారు. ఆయా పోలింగ్ స్టేషన్లను బట్టి కొన్ని పెద్ద వాహనాలు, మరికొన్ని చిన్న వాహనాలు ఉపయోగిస్తున్నాం.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు..

వేసవి కాలం అయినందున పోలింగ్ సిబ్బంది, ఓటర్లకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచుతాం. ఈ ఎన్నికల్లో మహిళా సిబ్బందికి విధులు కేటాయించలేదు. సరిపడా పురుష ఉద్యోగులు ఉన్నందున వారినే ఎన్నికల విధులకు ఉపయోగిస్తున్నాం.

ఆర్జాలబావి గోదాం వద్ద రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూం

నల్లగొండ పట్టణ సమీపంలోని ఆర్జాలబావి వేర్ హౌజింగ్ గోదాముల్లో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశాం. అక్కడి నుంచే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులను పంపుతాం. 26వ తేదీన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు వెళ్తారు. 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుంది. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను

27న ప్రత్యేక సెలవు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన వారికి ఈ నెల 27న పోలింగ్ సందర్భంగా ప్రత్యేక సెలవు ఇస్తున్నాం. దాంతో పోలింగ్ స్టేషన్లు ఉన్న కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలకు కూడా సెలవు ప్రకటించాం.

పోలింగ్ సమయం వరకు ఉండాల్సిందే..

కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 6 నుంచి 9 మంది వరకే ఓటర్లున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలో కనిష్ఠంగా ఆరుగురు ఓటర్లున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో ఒకటో పోలింగ్ స్టేషన్ ఉండగా నల్లగొండ జిల్లా గుడిపల్లిలో చివరి పోలింగ్ స్టేషన్ ఉంది. తక్కువ మంది ఓటర్లు ఉన్న కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం వరకే వంద శాతం పోలింగ్ పూర్తయినా సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లోనే ఉండాలి.

నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తాం. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తాం. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుంది.

12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేయొచ్చు..

ఓటు హక్కు కలిగిన వారు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కు ఉపయోగించవచ్చు. ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ తదితర గుర్తింపు పొందిన వాటితో ఓటు వేయవచ్చు.

ప్రలోభాలకు గురికావద్దు..

విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఆయుధం. మనకు ప్రజాస్వామ్య బద్ధంగా ఎవరైతే సేవ చేస్తారో అలాంటి సమర్థులైన, సేవా భావం కలిగిన వారిని ఎన్నుకోవాలి.

భద్రత నడుమ బ్యాలెట్ బాక్సుల తరలింపు

పోలింగ్ పూర్తయిన తర్వాత ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి పోలీస్ భద్రత నడుమ నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్స్‌లను తరలిస్తాం. పోలింగ్ కేంద్రాల ఎన్నికల సిబ్బంది 27వ తేదీ రాత్రి వరకు రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులను తెస్తారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వాజేడు తదితర దూర ప్రాంతాల నుంచి వాహనాలు వచ్చేందుకు 28వ తేదీ ఉదయం వరకు సమయం పట్టవచ్చు. ఏ వాహనం కూడా పోలింగ్ స్టేషన్ నుంచి బయల్దేరిన తర్వాత మధ్యలో ఆపడానికి వీల్లేదు. వాహనాల రాకను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశాం.

● మహా శివరాత్రికి ముస్తాబు



బుధవారం మహా శివరాత్రి సందర్భంగా విద్యుద్దీపాలతో ముస్తాబైన నల్లగొండలోని పానగల్ ఛాయా సోమేశ్వరాలయం

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం 4 గంటలతో ముగిసింది. నామినేషన్ల ఉపసంహరణ ముగిసిన 13వ తేదీ నుంచి అభ్యర్థులు ముమ్మర ప్రచారం చేశారు. మూడు ఉమ్మడి జిల్లాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, జూనియర్, డిగ్రీ, యూనివర్సిటీ, మెడికల్ కళాశాలల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. సభలు, సమావేశాలు నిర్వహించారు. తాము గెలిస్తే ఏం చేస్తామో చెబుతూ ఓట్లు అభ్యర్థించారు. మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. దీంతో కొందరు అభ్యర్థులు ప్రలోభాలను షురూ చేశారు.ఇప్పటిదాక బహిరంగ ప్రచారంలో తలమునకలైన అభ్యర్థులు.. ఇప్పుడు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునే పనిలో పడ్డారు. పలువురు అభ్యర్థులు ఓటుకు రూ.వేయి నుంచి రూ.5 వేల వరకు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు కవర్ల ద్వారా అందిస్తుండగా మరికొందరు ఇతరుల పోన్ల నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే చేస్తున్నట్లు ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. ఉపాధ్యాయుల వాట్సప్ గ్రూపుల్లో కొంత మంది అభ్యర్థులు చేసిన ఫోన్ పే, గూగుల్ పే స్క్రీన్ షాట్లు దర్శనమివ్వడం గమనార్హం.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న సాయంత్రం 4 గంటల నుంచి 27న పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పిరియడ్ అమల్లో ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో సభలు, సమావేశాలు నిర్వహించొద్దని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు టీఎస్ఎస్‌పీ సిబ్బందితో పాటు దాదాపు 600 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని.. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వీరు విధులు నిర్వహిస్తారని తెలిపారు.

మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

కేతేపల్లి : వన నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కేతేపల్లి మండలంలోని చెర్కుపల్లి వన నర్సరీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ వరకు మొక్కలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలను ఎండ నుంచి సంరక్షించేందుకు షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎఫ్‌ఏ జెబునిసాబేగం తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు తహసీల్దార్ సస్పెన్షన్

నల్లగొండ : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, జిల్లా యంత్రాంగం ఆదేశాలను బేఖాతరు చేస్తూ సెలవుల్లో ఉన్న గుర్రంపోడు తహసిల్దార్ జి.కిరణ్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల ప్రకారం.. గుర్రంపోడు తహసీల్దార్ జి.కిరణ్‌కుమార్ జవనరి 6 నుంచి 16 వరకు కలెక్టర్ అనుమతితో సెలవులో ఉన్నారు. జనవరి 17న విధుల్లో చేరాల్సి ఉండగా.. సెలవును జనవరి 31 వరకు పొడిగించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు మళ్లీ సెలవును పొడిగించారు. ఈ సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద లబ్ధిదారుల ఎంపిక, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాల నేపథ్యంలో కలెక్టర్.. కిరణ్‌కుమార్‌కు సెలవు మంజూరు చేయలేదు. అయినా విధుల్లో చేరకపోవడంతో అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఫిబ్రవరి 25 వరకు కిరణ్‌కుమార్ విధుల్లో చేరకపోవడమే కాకుండా, ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దీంతో కిరణ్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

భూగర్భ జలాల పెంపుతోనే అభివృద్ధి

- తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాం ప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ ఇంజనీర్లు

మునుగోడు : హైదరబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నేటికి అభివృద్ధి చెందకపోవడానికి ప్రధాన కారణం నీటి వనరులు లేకపోవడమేనని.. దాన్ని అధిగమించాలంటే భూగర్భ జలాలు పెంచుకోవడం ఒకటే మార్గమని తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం పలువురు ఇంజనీర్లు, భూగర్భ జలశాఖ అధికారులతో కలసి మునుగోడు ప్రాంతంలోని వాగులు, చెరువులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మునుగోడుకు సాగునీరు అందాలంటే నక్కలగండి సొరంగ మార్గం పూర్తికావాల్సి ఉందని.. కానీ అది ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదన్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి దఫాగా 124 చెరువులు, 20 చెక్ డ్యామ్‌లు, 42 డైక్‌ల నిర్మాణానికి రూ.120 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వీటి నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని కిష్టాపురం, ఘట్టుప్పల్ గ్రామాల శివార్లలో ఫార్మా కంపెనీల నిర్మాణానికి వెంటనే నిలిపివేయాలని కోరారు. సమావేశంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, రాములు, లక్ష్మయ్య, చంద్రమౌళి, ఎం.సత్తిరెడ్డి, డీఎస్.రెడ్డి, సత్తయ్య, శంకరయ్య, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ప్రజలు సహకరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్ : పేదలకు 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. కొన్ని కేసుల విషయంలో రోగులు, వారి సహాయకులు.. సిబ్బందిని వేధిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని అలాంటి సంఘటనలకు పాల్పడవద్దని సూచించారు. మంగళవారం ఆమె ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మాతా శిశు సంరక్షణ విభాగం, ఇతర వార్డులను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని సమర్థులైన వైద్యులు నిరంతరం రోగులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆస్పత్రికి అవసరమైన రేడియాలజిస్ట్‌లను డిప్యుటేషన్‌పై తీసుకొచ్చామన్నారు. కొంత మంది సంఘ వ్యతిరేక శక్తులు కొన్ని కేసుల విషయంలో డాక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తించిన సంఘటనలు ఉన్నాయని.. వాటిని దృష్టిలో ఉంచుకుని ఎస్పీతో కలిసి ఆస్పత్రిని సందర్శించామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎంహెచ్‌ఓ

ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ కొంతమంది కావాలని వైద్యులు, సిబ్బందిని వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆసుపత్రిలో నిఘాను పెడతామని, డాక్టర్లు, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తేవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, ఆస్తులను ధ్వంసం చేయడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీసీఎస్‌హెచ్ మాతృనాయక్, సూపరింటెండెంట్ అరుణశ్రీ అధికారులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి



శానిటరీ నాప్కిన్స్‌తో విద్యార్థినులు

నకిరేకల్ : కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి సూచించారు. మంగళవారం నకిరేకల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను పోత్సహించవద్దన్నారు. ఎలాంటి ఆకర్షకులకు లోనుకాకుండా.. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని.. వాటి సాధనకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ మేకల నాగయ్య, హెచ్ఎం కోదాటి రాములు, మండల వైద్యాధికారి యోగస్వీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జి.సునీత, భవాని, అంజమ్మ, పద్మావతి, సరిత, కళావతి, శారద తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా రూ.202.48 కోట్లు

- మూడు ఎకరాల్లోపు రైతుల ఖాతాల్లో మాత్రమే జమ
- 2,76,694 మంది రైతులకు అందిన సొమ్ము
- మిగతా రైతులకు తప్పని ఎదురుచూపులు



నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లాలోని రైతులకు రైతు భరోసా నిధుల జమ నత్తనడకన సాగుతోంది. జనవరి 26న ఎంపిక చేసిన 31 గ్రామాల్లోని రైతులకు మాత్రమే యాసంగి సీజన్‌కు సంబంధించి ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమచేసిన విషయం తెలిసిందే. తర్వాత దశల వారీగా ఇప్పటి వరకు 2,76,694 మంది రైతులకు రూ.202,48,72,111 జమచేసింది. మూడు ఎకరాల్లోపు భూమిఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా అందించింది. రైతు భరోసాను ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. ఇక.. ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసాను అందిస్తుందో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు.

మూడు దశల్లో జమైన రైతుభరోసా వివరాలు..

విడత	రైతులు	నిధులు (రూ.లలో)
మొదటి	35,568	46,93,19,160
రెండవ	1,55,232	88,42,80,319
మూడవ	85,894	67,2,72,632
మొత్తం	2,76,694	202,48,72,111

5,60,801 పట్టాదార్ పాస్‌బుక్కులు..

జిల్లా వ్యాప్తంగా 5,60,801 మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్కులు ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ గణాంకాలు చెపుతున్నాయి. 12,040 ఎకరాలు సాగుకు యోగ్యం కాని భూమిగా అధికారులు ఇటీవల గుర్తించారు. వాటిలో గుట్టలు, ఇండ్లు, ప్లాట్లు, ఫంక్షన్‌హాళ్లు, గోదాములు, సినిమాహాళ్లు, పెట్రోల్ బంకులు ఉండడంతో ప్రభుత్వం వాటికి రైతు భరోసా అమలు చేయడం లేదు. ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా భరోసా ఇవ్వమని చెప్పడంతో అవి ఎన్ని ఎకరాల వరకు ఉన్నాయో తెలియలేదు. ఇప్పటివరకు కేవలం మూడు ఎకరాలలోపు వారికి మాత్రమే డబ్బులు జమచేయడంతో మిగతా రైతులకు ఎన్ని నెలల వరకు జమ చేస్తారోననే అనుమానాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

విడతల వారీగా రైతుభరోసా జమ



రైతు భరోసా నిధులు ఇప్పటి వరకు మూడు విడతల్లో మూడెకరాలలోపు రైతులకు జమచేసింది. మిగతా రైతులకు విడతల వారీగా ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ